క్లుప్తంగా

గ్రామాల స్వచ్ఛత కోసమే సీఆర్పీలకు శిక్షణ
డీఎల్‌పీవో శ్రీనివాసరావు



ప్రత్తిపాడు: గ్రామాలను స్వచ్ఛ బాటలో నడిపించడమే సీఆర్పీల లక్ష్యమని గుంటూరు డివిజన్ డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం పంచాయతీలోని సుప్రీమ్ ఎల్‌టీసీలో రెండవ రోజు పెదనందిపాడు, వట్టిచెరుకూరు, పెదకాకాని, తుళ్ళూరు, మేడికొండూరు మండలాల సీఆర్పీలకు వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతలో సీఆర్పీలది కీలకపాత్ర అని తెలిపారు. గ్రామం మనకు ఏమి ఇచ్చిందని కాకుండా, గ్రామానికి మనం ఏమి చేశామో.. ప్రతి ఒక్కరికీ తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, ఐటీసీ, ఫినిష్ సొసైటీ కో ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, సీఆర్పీలు పాల్గొన్నారు.

అక్టోబర్ 2 వరకు సేవా పక్షోత్సవాలు

ప్రత్తిపాడు: భారత ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు అన్ని గ్రామాల్లో సేవా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి తెలిపారు. పెదనందిపాడు మండలం వరగానిలో మంగళవారం మండల అధ్యక్షుడు వెలగా గంగాధర్‌రావు అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు ఈద శ్రీనివాసరెడ్డి, భీమినేని రవి, పార్టీ నాయకులు చెన్నుపాటి ఆనందరావు, చెన్నుపాటి హరిబాబు, చుండూరి సురేష్, బొల్లేపల్లి బాజీబాబు, పోపూరి సుధీర్, నారాయణ, ఎర్రం సుబ్బారావు, నిజాంపట్నం సురేష్, మహేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో మృతి చెందిన చిన్నారి కుటుంబానికి పరామర్శ



పొన్నూరు: మండలంలోని గ్రామాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టనున్నట్లు తెనాలి డివిజనల్ పంచాయతీ అధికారి వి.స్వరూపరాణి అన్నారు. వెల్లలూరు గ్రామంలో గత నెల 22వ తేదీన వీధి కుక్క దాడి చేసిన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఐదేళ్ల చిన్నారి కుటుంబ సభ్యులను మంగళవారం డీఎల్పీవో పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పలు వీధులను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ చిన్నారి మృతి ఎంతో ఆవేదన కలిగించిందని అన్నారు. కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో ఎంఎస్ఎంఈల కీలకపాత్ర


మంగళగిరిటౌన్: దేశ సామాజిక ఆర్థికాభివృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కీలక పాత్ర పోషిస్తున్నాయని ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కె. నాగేంద్రబాబు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి కార్యాలయంలో మంగళవారం ఎంఎస్ఎంఈల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు, దేశంలోని మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి దోహదపడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈల అభివృద్ధే లక్ష్యంగా ర్యాంప్ స్కీమ్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీ ఉండవల్లి శాఖ బ్యాంక్ మేనేజర్ మాధవి, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు చెందిన వారు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో మోడల్ లైబ్రరీ



తాడేపల్లి రూరల్: మంగళగిరిలో మోడల్ లైబ్రరీ త్వరలో ప్రారంభం కానుంది. దీనికి మంత్రి లోకేష్ రూ.1.30 కోట్ల నిధులను కేటాయించారు. మంగళగిరి శివాలయం పక్కన గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మొదటి అంతస్తులో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు రెండు క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. కాంపిటేటివ్, సాఫ్ట్ స్కిల్ తరగతులు నిర్వహిస్తారు. డిజిటల్ లైబ్రరీ, 20 కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పిల్లలకు ఉపయోగపడేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దినపత్రికలు, వార, మాస పత్రికలు అందుబాటులో ఉండటానికి రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు.

బయటకు రావాలంటే హడల్..!



టిడ్కో గృహాల వద్ద సంచరిస్తున్న కుక్కలు

పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రస్థాయికి చేరుకుంది. ప్రధాన మార్గాల్లో పదుల సంఖ్యలో సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం నిడుబ్రోలులోని టిడ్కో గృహాల వద్ద వీధి కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిచ్చాయి. స్థానికంగా కుక్కల బెడద ఎక్కువగా ఉందని నివాసితులు వాపోతున్నారు. రాత్రయితే బయటకు రావాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– పొన్నూరు

• పైపులైను లీకు.. వృధాగా తాగునీరు



రోడ్డుపై వృధా అవుతున్న నీరు

నిడుబ్రోలులోని టిడ్కో గృహాలకు వెళ్లే ప్రధాన రహదారిలో మంచినీటి పైపులైను లీకు అవడంతో తాగునీరు వృధాగా పోతుంది. ఆ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. లీకు కారణంగా తాగునీరు వృధా అవుతుందని ఫిర్యాదు చేసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– పొన్నూరు

కాలువలు ఆక్రమిస్తే చర్యలు
మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు



పొన్నూరు: సైడ్ కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకుని, ఆ నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ముబారక్ నగర్, 21వ వార్డులో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీలపై అక్రమంగా నిర్మించిన పార్కింగ్ స్లాబ్‌లను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు పునరావృతమైతే ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీర్లు సమాజానికి సాంకేతిక సాయం అందించాలి

సబ్ కలెక్టర్ సంజనా సిన్హా



ఏసీఎం క్రానికల్-2024 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా తదితరులు

పెదకాకాని: సాంకేతికత దైనందిన జీవనంలో భాగం అయినందున ఇంజనీర్లు సమాజానికి అవసరమైన సాంకేతిక సాయం అందించాలని తెనాలి సబ్ కలెక్టర్, ఐఏఎస్ అధికారి వి.సంజనా సిన్హా అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ (ఏసీఎం) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండురోజుల పాటు నిర్వహించనున్న స్పర్థ-2కే25 సాంకేతిక సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సంజనా సిన్హా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజనా సిన్హా మాట్లాడుతూ చదువు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని, సాంకేతికతతో సమాజంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన వ్యవస్థాపకుల అవసరం ఉందని, ఇంజనీర్లు వ్యవస్థాపకులుగా మారాలని సూచించారు. విద్యార్థులు ఓటమి చెందినప్పుడు నిరాశ చెందక ఆలోచన చేసి విజయం వైపు సాగాలన్నారు. అనంతరం ఏసీఎం క్రానికల్ 2024 పుస్తకాన్ని సంజనా సిన్హా ఆవిష్కరించారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 36 కళాశాలల నుంచి 210 గ్రూపులు, 1,470 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో గేమ్ ఆఫ్ కోడ్, అల్లా ఆరీనా, ట్రెజర్ ట్రూపర్స్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, సీఎస్ఈ, ఐటీ, సీఎస్ఎం విభాగాధిపతులు డాక్టర్ వి.రామచంద్రన్, డాక్టర్ కళావతి, డాక్టర్ కె.సురేష్‌బాబు, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.సాయిజ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదు



పెదకాకానిలో మాట్లాడుతున్న ఏడీఏ మోహన్‌రావు



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

గుంటూరు ఏడీఏ మోహన్‌రావు

పెదకాకాని: రైతులు యూరియా సరఫరాపై కంగారు పడాల్సిన అవసరం లేదని గుంటూరు ఏడీఏ ఎన్.మోహన్‌రావు అన్నారు. పెదకాకాని గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి గుంటూరు ఏడీఏ మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏవో కె.రమణకుమార్ అధ్యక్షత వహించారు. రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీఏ మోహన్‌రావు మాట్లాడుతూ రైతులకు యూరియా గురించి ఎటువంటి కంగారు పడాల్సిన అవసరం లేదని తగినంత యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు సాగు చేస్తున్న వివిధ పంటల్లో ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. ఎల్‌ఆర్‌జీ 52 కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కంది విత్తనాలు పొలం గట్ల మీద నాటుకోవాలని సూచించారు. అలాగే ఈ నెల 25వ తేదీన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం ఉందని, రైతులకు బ్రోమోడైలిన్ ప్రభుత్వం ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పొన్నూరు: మండలంలోని దొప్పలపూడి, మన్నవ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్ పంట పొలాలను సందర్శించి వరి పైరులో రెండోసారి నత్రజని ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఎక్కువగా నత్రజని వినియోగంతో చీడపీడలు ఎక్కువగా వస్తాయని, రైతులు గమనించి ఎకరాకు 25 కిలోల యూరియా వినియోగించాలన్నారు. రెండోసారి కాంప్లెక్స్ ఎరువులు వినియోగించరాదని సూచించారు. దీంతో పాటు 15 కిలోల పొటాష్ ఎరువులు, వినియోగిస్తే పైరుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో దొప్పలపూడి సర్పంచి కె.రమేష్, వ్యవసాయ సహాయకులు పూజశ్రీ, కె.పవన్, ఎంపీఈవో ఎస్.సురేష్‌బాబు పాల్గొన్నారు.

చమళ్లమూడిలో 'పొలం పిలుస్తోంది'

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ క్రాప్ నమోదు గురించి ఏడీఏ సునీత రైతులకు వివరించారు. నానో యూరియా ఉపయోగాలు తెలియజేశారు. ఏవో రాజవంశీ రైతులకు ఎరువుల వినియోగం తదితర విషయాలపై శిక్షణ అందించారు. నేల ఆరోగ్యం, ట్రైకోడెర్మా, పెసియోడోమోనాస్ వినియోగం గురించి వివరించారు. మినుము, మిర్చి పంటల సాగులో మెలకువలు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్ సునీత, వీఏఏ శిరీష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో 'స్వస్థ నారీ'

- మహిళల ఆరోగ్యం కోసం కేంద్రం కొత్త కార్యక్రమం
- అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు
- ప్రణాళికను సిద్ధం చేసిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు



స్వస్థ నారీ కార్యక్రమం పోస్టర్

ప్రత్తిపాడు: మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారీ, స్వశక్తి పరివార్ పేరుతో నూతన కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పక్షం రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనుంది. ఇందులో భాగంగా మహిళలకు సోకుతున్న అసంక్రమిత వ్యాధులను ప్రత్యేక స్క్రీనింగ్ ద్వారా గుర్తించనున్నారు.

సరైన ఆహారంపై అవగాహన

అంతేకాకుండా మహిళలు బలంగా ఉండటానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలి వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఇందులో భాగంగా పోషణ్ అభియాన్, ఈట్ రైట్ (సరైన ఆహారం) తీసుకోవడం ద్వారా రక్తహీనతను ఎలా అధిగమించవచ్చు అన్న అంశాలపై వివరించనున్నారు. తల్లీబిడ్డల సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు చేయనున్నారు. క్షయవ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు అందించనున్నారు. అదేవిధంగా కిశోర బాలికలకు కూడా ఆరోగ్య పరీక్షలు చేయనున్నారు.

మహిళలకు నిర్వహించనున్న పరీక్షలు ఇవీ...
- రక్తపోటు
- మధుమేహం
- నోటి క్యాన్సర్
- రొమ్ము క్యాన్సర్
- గర్భాశయ క్యాన్సర్

శిబిరాలు ఇలా...

ప్రత్తిపాడు మండల పరిధిలోని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కో లొకేటెడ్ పీహెచ్‌సీల పరిధిలో గ్రామాల వారీగా నిర్వహించనున్న శిబిరాల వివరాలను గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ తెలిపారు. గ్రామాల్లో మహిళలకు శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేయనున్నారు.

నేడు కృత్రిమ ఉపకరణాల పంపిణీ
ఎంపీడీవో శివపార్వతి

ప్రత్తిపాడు: నియోజకవర్గ పరిధిలోని గుంటూరు రూరల్, కాకుమాను, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లోని వికలాంగులు, సీనియర్ సిటిజన్‌లకు నేడు కృత్రిమ ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎంపీడీవో కె.శివపార్వతి తెలిపారు. అసెస్మెంట్ క్యాంపులో అర్హులను గుర్తించి, బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా కృత్రిమ ఉపకరణాలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హాజరుకానున్నారని ఆమె పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



ఫిరంగిపురం: క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని హెచ్‌ఎం లింగిశెట్టి సాంబయ్య అన్నారు. మండలంలోని వేములూరిపాడు జెడ్పీ హైస్కూల్లో మంగళవారం రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో విద్యాశాఖ ఆధ్వర్యాన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో భాగంగా ఈనెల 15న చిలుకలూరిపేట ఎంజీలో ఆటల పోటీలు నిర్వహించారన్నారు. ఈపోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఆసిఫా, సాయివర్ధన్‌లు జిల్లాస్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ సుజాత, ఉపాధ్యాయులు రాజులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



తాడేపల్లి రూరల్: గొల్లపూడిలో ఈ నెల 25న జరగనున్న అంతర్‌జిల్లా కబడ్డీ పోటీలకు తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులోఉన్న గుడ్ న్యూస్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరస్పాండెంట్ రెవ. ఫాదర్ మాట్లాడుతూ స్కూల్‌కు చెందిన ఎస్. సింధు, కె.ఏడుకొండలు అంతర్‌జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యదాస్, అడ్మినిస్ట్రేటర్ రెవ. ఫాదర్ సుగంధన్, క్యాంప్ ఇన్‌చార్జి రెవ. ఫాదర్ సెబాస్టియన్, ఫిజికల్ డైరెక్టర్స్ అజయ్‌కుమార్, డి.సురేష్ తదితరులు అభినందించారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

దుగ్గిరాల: శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభమైంది. మంగళవారం దుగ్గిరాల గ్రామ పంచాయతీ సచివాలయం-2లో ఆధార్ సేవలు ఇక నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాయని దుగ్గిరాల కార్యదర్శి వివేకానంద తెలిపారు. మండల ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి పోషణ్ మాసోత్సవాలు

ఐసీడీఎస్ సీడీపీవో జి.విజయలక్ష్మి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు సీడీపీవో జి.విజయలక్ష్మి తెలిపారు. 17వ తేదీన రావిపాటివారిపాలెం, గనికపూడి గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు ఐవైసీఎఫ్ కౌన్సెలింగ్, 18న తుమ్మలపాలెంలో ఊబకాయం నివారణపై అవగాహన, 19న ప్రత్తిపాడు, వంగిపురంలో పోషణపై పురుషులకు కమ్యూనిటీ ప్రతిజ్ఞలు, 20న చినకోండ్రుపాడు, కొండేపాడులో ఏపీపీఏఆర్ఐడీ నమోదు, 22న ప్రత్తిపాడు, గొట్టిపాడుల్లో మూడేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన, 23న ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెంలో స్థానికంగా లభ్యమయ్యే పోషకాహారంపై అవగాహన, 24న యనమదల పాతమల్లాయపాలెంలో తల్లిపాలు, అనుబంధ ఆహారంపై అవగాహన, 25న నడింపాలెం, తిమ్మాపురంలో ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై అవగాహన, 26న ప్రత్తిపాడు పెదగొట్టిపాడుల్లో వెయ్యి రోజుల్లో మెదడు అభివృద్ధిపై అవగాహన, 27న నడింపాలెం ఎస్‌పీసీ కాలనీ, వంగిపురంలో సంప్రదాయ వంటకాలతో ప్రయోజనాలపై అవగాహన, ప్రదర్శన, 29న ప్రత్తిపాడులో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీడీపీవో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మాసోత్సవాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని విజయలక్ష్మి స్పష్టం చేశారు.

ఆర్‌వీఆర్‌జేసీలో సోలార్‌పవర్‌పై వర్క్‌షాప్



సోలార్ పవర్ ప్యానల్స్ గురించి వివరిస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: భవిష్యత్తు ప్రధాన శక్తి వనరుగా సౌరశక్తి ప్రపంచ వ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణలు చేయాలని హెచ్‌ఐఈఈ ఎంపవరింగ్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మదన్ మోహన్‌గౌడ్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోలార్ పీవీ యూనిట్ డిజైన్, ఇన్‌స్టలేషన్ అండ్ మెయింటెనెన్స్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు సౌరశక్తి వినియోగ ప్రాధాన్యం, సోలార్ ప్యానెల్ డిజైన్, ఇన్‌స్టలేషన్ పద్ధతులు, నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్క్ (రాజస్థాన్) భారత్‌లో ఉండటం గర్వకారణమని, సౌరశక్తి వినియోగాన్ని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలతో అనేక ప్రాజెక్టులు అమలు చేస్తున్నాయన్నారు. సౌరశక్తి వినియోగంతో పర్యావరణ పరిరక్షణకే కాకుండా విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థుల ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, ఎంపవరింగ్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ మేనేజర్ జహీర్‌ఖాన్, డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ ఎన్‌సీ కోటయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు 'సంక్షేమాన్ని' అమలుచేయాలి

సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పారిశుద్ధ్య కార్మికులకు కూడా అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ కోరారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని కోరుతున్నామన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, గ్లౌజులు, చెప్పులు వెంటనే మున్సిపల్ అధికారులు కార్మికులకు అందజేయాలని కోరారు. కార్మికులు ఇక్కట్లపై పాలకులు స్పందించి తీర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కొలనుకొండ పారిశుద్ధ్య కార్మికులతో కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడిగా పాపయ్య, ఉపాధ్యక్షులుగా బేబి, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా అంగమ్మ, కోశాధికారిగా కె.రాజును ఎన్నుకున్నారు.

సత్వర న్యాయానికి న్యాయవాదుల పాత్ర కీలకం



న్యాయవాదులను సత్కరిస్తున్న కంచర్ల కాశయ్య

మంగళగిరిటౌన్: ప్రజలకు సత్వర న్యాయసేవలు అందించడంలో న్యాయవాదులు కీలకపాత్ర వహిస్తున్నారని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. మంగళగిరి నగరపరిధిలోని న్యాయవాదుల దినోత్సవం పురస్కరించుకుని పలువురు న్యాయవాదులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ పేదలు, వెనుకబడిన వర్గాలకు చట్టపరమైన రక్షణ కల్పించడంలో అందిస్తున్న సేవలు అపూర్వమైనవని కొనియాడారు. ఈ సేవలు భవిష్యత్తులో కొనసాగాలని, న్యాయవాదులు ప్రజాహక్కుల పరిరక్షణలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా శివరామ ప్రసాద్, సీనియర్ న్యాయవాది వాకా రామ్‌గోపాల్‌గౌడ్‌లను సన్మానించారు.

కార్మికుల సమస్యలు తీర్చండి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చడానికి ప్రభుత్వం ముందుకు రావాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ నేత ఆదినారాయణ కోరారు. మంగళవారం ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న నిరాహార దీక్షా శిబిరాన్ని నాయకులు సుభాని, వై.సాంబశివరావుతో కలసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కోర్టు తీర్పుల ప్రకారం న్యాయంగా రావాల్సిన బకాయిల కోసమే కార్మికులు దీక్షలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నేతలు వై.రమాదేవి, శారమ్మ, సువర్ణకుమారి, రిబ్కా, కాసమ్మ, శివకుమారి, ఇమాంబి, దుర్గాభవాని, నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.